క్లుప్తంగా

నేడు మండల సమావేశం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల సర్వసభ్య సమావేశం నేడు బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా మంగళవారం తెలిపారు. కావున మండలాధ్యక్షుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ



పాడిరైతులకు గడ్డివిత్తనాలు పంపిణీ చేస్తున్న పశువైద్యులు వెంకటసుబ్బయ్య

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లె సచివాలయంలో మంగళవారం పశువైద్యులు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో పాడిరైతులకు 50 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు రైతులకు అందించారు. ప్రభుత్వం పాడిరైతులకు అనేక పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. 5 కేజీల బ్యాగు ధర రూ.115లు అని తెలిపారు. కావాల్సిన రైతులు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వెంకటసుబ్బయ్య, మణి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు వరం పశువిజ్ఞాన బడి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పాడి రైతులకు పశు విజ్ఞాన బడి వరంలాంటిదని చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ కె.డి. ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొండూరు దళితవాడలో మంగళవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుదుల నివారణ మందులు, ఏలికపాములు నివారణ మందులు పంపిణీ చేశామని, రైతులు ఈ మందులను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండూరు గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పుల్లయ్య, పశు విజ్ఞాన బడి ప్రాంతీయ పశువైద్యశాల చిట్వేలి డీఈఓ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుక



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నందలూరు(రాజంపేట) : మండల కేంద్రంలోని జ్ఞానదీప్తి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను సోమవారం కరస్పాండెంట్ జానకినాథ్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులతో భోగిమంటలను ఏర్పాటు చేసి భోగి మంటలు చుట్టూ గొబ్బెమ్మ పాటలు, ఉత్సాహంగా భోగి పండుగను జరిపారు. అనంతరం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులకు గాలిపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, వినయ్, సురేష్, తులసీరామ్, సాదిక్ బాషా, పద్మ, నాగరత్న, దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రం పరిధిలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,22,340లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీ నుంచి నేటి వరకు భక్తులు వేసిన కానుకలను అధికారులు, ఆలయ కమిటీ సమక్షంలో లెక్కించారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, గడికోట చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రైల్వేకోడూరు : పట్టణంలోని గాండ్లవీధిలో వెలసిన భక్తాంజనేయస్వామికి మంగళవారం భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట

మదనపల్లె : మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్‌లోని శ్రీ సప్పలమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 8న కలశస్థాపన, గణపతిపూజతో ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ప్రత్యేక పూజలు, విగ్రహ ధాన్యాధివాసం జరిగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రజా సంకల్ప యాత్ర ఓ మేలిమలుపు

- సీఎం వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రకు ఐదేళ్లు పూర్తి
- రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు



రాయచోటిలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, స్థానిక నాయకులు

రాయచోటి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తయి నేటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. మంగళవారం కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ కొలిమి హరూన్, ఆసిఫ్ అలీఖాన్, ఫయాజ్ మహమ్మద్, బీసీ సెల్ విజయభాస్కర్, గౌస్‌ఖాన్, కొలిమి చాన్‌బాషా, రియాజ్, అల్తాఫ్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్రయాదవ్, అన్నా సలీం, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, నేలపాటి వెంకటేష్, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర, మూసా, కో-ఆప్షన్ అయ్యవారురెడ్డి, ఆసీఫ్ అలీఖాన్, హజరత్ ఖాజావలి, సంజీవయ్య, జావీద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమాన్ని ఓ మేలిమలుపు తిప్పిన ప్రజా సంకల్పయాత్ర లాంటి చారిత్రక ఘట్టంలో మనమంతా భాగస్వాములు అయినందుకు గర్వపడుతున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నిరాశ, నిస్పృహలకు లోనై ఆందోళన చెందుతున్న రాష్ట్ర ప్రజలకు నేనున్నాను అంటూ ధైర్యం చెప్పి జనంతో కలిసి అడుగులు వేసిన జగన్ ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిందన్నారు. 3648 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర ఇచ్ఛాపురంలో ముగిసిందన్నారు. పాదయాత్రలో తెలుసుకున్న ప్రజల కష్టాలు వారి కన్నీళ్లను, కుంటుపడిన అభివృద్ధిని కళ్లారా చూసిన ముఖ్యమంత్రి నేడు అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో భాగమయ్యారన్నారు. అధికారంలోకి వచ్చినపుడు నుంచి రాజకీయాలు వదిలిపెట్టి ప్రజలకిచ్చిన హామీలను కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ మహానేత వైఎస్సార్ తనయుడిగా ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థ, రాష్ట్ర సంక్షేమాన్ని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో విజయం సాధించారన్నారు. రాష్ట్ర ఖజానా నుంచి రూ.2.50 లక్షల కోట్లను ప్రజల దగ్గరికి నేరుగా చేర్చిన నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.

రోగులందరికీ వైద్య సేవే ప్రభుత్వ లక్ష్యం



చిన్నమండెం: రోగులకు మందులను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు



నందలూరులో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శరత్ కమల్



సిద్దవటం: రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం : రోగులందరికీ వైద్య సేవలు అందిచాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని పి. కొత్తపల్లి వైద్యాధికారిని డాక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ప్రభుత్వం ద్వారా కంటి అద్దాలు మంజూరు కావడంతో వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రంగలక్ష్మి, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు(రాజంపేట) : ప్రతినెల 9వ తేదీన ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారులు శరత్ కమల్, కార్తీక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు, రక్త పరీక్షలు, మాత్రలు పంపిణీ చేస్తుందని, కావున గర్భిణులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు మంచి పోషక విలువలు కల్గిన ఆకుకూరలు, కూరగాయలు, గ్రుడ్లు, పాలు, చేపలు, మాంసం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మొదటి గర్భం దాల్చిన మహిళలు బ్యాంక్ అకౌంట్ నెంబరు, ఆధార్ కార్డు, (బర్తడి, భార్యది) సంబంధిత ఏఎన్ఎంలకు ఇచ్చి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో వచ్చే ఆరువేలు రూపాయలు లబ్ధి పొందాలన్నారు.

వండాడి గ్రామంలో..

చిన్నమండెం : వండాడి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య, సర్పంచ్ ముసల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 322 మంది రోగులకు వైద్యులు డా.రియాజ్, డా.రఫీవుల్లాబేగ్, డా.రెడ్డినరేష్, డా.మౌనిక వైద్యం అందించారు. వైద్యం పొందిన వారికి అవసరమైన వారికి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు రాజంపేట డీఎస్పీ చైతన్య సూచన



ఫ్రెషర్స్ డేలో డీఎస్పీ చైతన్య తదితరులు

రాజంపేట : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రాజంపేట డీఎస్పీ చైతన్య అన్నారు. మంగళవారం ఏఐటీఎస్ అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డేలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు, మాదకద్రవ్యాల దరి చేరరాదన్నారు. ప్రతి విద్యార్థి సమాజసేవ దృక్పథంతో ముందుకెళ్లాలన్నారు. తల్లితండ్రి ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యను కష్టపడి కాకుండా, ఇష్టంగా చదువుకోవాలన్నారు. అప్పుడు వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రాజంపేట రూరల్ సీఐ మంజునాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్రమశిక్షణ, పోటీని తట్టుకునేలా చదవడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, మన్నూరు ఎస్ఐ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థినిని అభినందిస్తున్న సీఐ మధుసూదన్ రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : క్రీడలలో రాణిస్తున్న ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ మధుసూదన్ రెడ్డి మంగళవారం తెలిపారు. గత డిసెంబర్ నెల 31వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు మధ్య ప్రదేశ్‌లో జరిగిన తైక్వాండో జాతీయస్థాయి క్రీడలలో సిల్వర్ మెడల్ సాధించింది. స్థానిక ఎస్వీ కళాశాలలో జరిగిన ఆయన పాల్గొని విద్యార్థినీ తేజశ్వినిని సీఐ అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించి ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శారద, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వసుందరా దేవి, రవిశంకర్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో ఆక్రమణలు తొలగింపు

బందోబస్తు నడుమ తొలగింపు చర్యలు

గుర్రంకొండ : పట్టణంలోని జీవన్‌తోపు రోడ్డు కిరువైపులా నెలకొన్న ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారులు జేసీబీలతో తొలగించారు. జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 127లో 3.56 ఎకరాల రాస్తా పోరంబోకు స్థలం ఉంది. గత కొన్నేళ్లుగా ఈ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. పలువురు రోడ్డుకిరువైపులా ఉన్న ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకొన్నారు. రెండు సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఈ ఆక్రమణల విషయమై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలు నిజమేనని తేల్చారు. ఆక్రమణ దారులకు నోటీసులు కూడా అప్పట్లో జారీ చేశారు. ఇటీవల మూడునెలలుగా పలుమార్లు అధికారులు ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు. వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకొన్నారు. మరికొంతమంది కోర్టుకు వెళ్లలేదు. ఆక్రమణలను ఈనెల 31 తేదీలోగా తొలగించాలంటూ జిల్లా కలెక్టర్‌కు లోకాయుక్త నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనేపథ్యంలో మంగళవారం తహసీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం స్థానిక పాత గ్రామీణ బ్యాంకు భవనం నుంచి జేసీబీలతో ఆక్రమణ తొలగించే ప్రక్రియ చేపట్టారు. అయితే కొంతమంది టీడీపీ నాయకులు తొలగింపు ప్రక్రియను అడ్డుకొనేందుకు యత్నించారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. అనంతరం రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు ఎట్టకేలకు తొలగించారు. కోర్టుస్టే ఆర్డరు తెచ్చుకొన్న ఆక్రమణదారుల కేసు ఈనెల 29న లోకాయుక్తలో విచారణ జరపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆరోజు వచ్చే తీర్పును బట్టి మిగిలిన ఆక్రమణలను కూడా తొలగిస్తామని వారు పేర్కొన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం రామానాయక్ తండా పరిసర ప్రాంతంలో నాటు సారా వండుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలసి మంగళవారం దాడులు నిర్వహించినట్లు సీఐ మల్లిక తెలిపారు. దాడుల్లో 800 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు.

మరో కేసులో ఎన్‌వోపీ తండాకు చెందిన ఎం.జయమ్మ (59) నాటు సారా విక్రయిస్తుండగా ఆమె నివాసంలో దాడులు నిర్వహించి 12 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం నిందితురాలిని రిమాండ్‌కు పంపామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ తెలియజేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

బి.కొత్తకోట : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సలీంబాషా డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను విడుదల చేయాలని కోరారు. భవన నిర్మాణ రంగం కుదేలైందని, కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బాలకృష్ణ, గఫూర్, రమేష్, శ్రీనివాసులు, బావాజాన్, ఖామూషా పాల్గొన్నారు.

శ్మశాన దారి సమస్యను పరిష్కరించండి



కబ్జా తొలగించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : చిన్నంపల్లి పంచాయతీ లింగిరెడ్డిపల్లి గ్రామంలో శ్మశాన దారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావులకు వినతిపత్రం అందించారు. లింగిరెడ్డిపల్లి గ్రామంలో శ్మశానికి వెళ్లే దారిని స్థానిక నాయకుడు ఆక్రమించారని, అక్రమంగా స్వాధీనం చేసుకున్న శ్మశాన దారిని పునరుద్ధరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జి.శివారెడ్డి, జి.శేషారెడ్డి, సి.చెంగల్ రాయుడు, పి.వెంకటసుబ్బారెడ్డి, కె.మణెయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

రాజంపేట టౌన్ : ఈనెల 12వ తేదీ నుంచి రెండు రోజులపాటు కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రీజనల్ కన్వీనర్ నీరుగట్టు నరసింహులు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వజ్రోత్సవ వేడుకల పోస్టర్‌ను నరసింహులు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాలుగా ఎస్టీయూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఎస్టీయూ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలను నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ తెలియజేశారు. స్థానిక డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటలోని 220 కెవిఎస్ఎస్‌తో పాటు పుల్లంపేట 132 కెవిఎస్ఎస్, 33 కెవి, 11 కెవి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం బుధవారం చేపట్టామన్నారు. రాజంపేట టౌన్, రాజంపేట రూరల్, పుల్లంపేట మండలంలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు. రాజంపేట మండలంలోని తాళ్ళపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, బావికాడపల్లి, కొండ్లోపల్లి, హెచ్ చెర్లోపల్లి, కట్టకిందపల్లి, మందరం, పుల్లంపేట మండలంలోని పీవీజీ పల్లి, దొండ్లోపల్లి, వత్తలూరు, రెడ్డిపల్లి, పుత్తనవారిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలియజేశారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ సంస్థకు సహకరించవలసిందిగా కోరారు.

పెనగలూరులోనూ..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారి షఫీ తెలిపారు. మండలంలోని కొండూరు, బెస్తపల్లి, పెనగలూరు, తిమ్మాయగారిపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. కావున రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు

రాజంపేట టౌన్ : మండలంలోని పెద్దకారంపల్లె పంచాయతీ పరిధిలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ముస్లిం మైనార్టీల శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.8 లక్షలు మంజూరైనట్లు జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.జాహిద్‌అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జిల్లా పరిషత్ నుంచి ఈ నిధులను మంజూరు చేశారన్నారు.

శ్మశాన వాటికకు ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయడం, శ్మశాన వాటిక అభివృద్ధికి జెడ్పీ నిధులను మంజూరు చేసినందుకు ఆయన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్ నాథరెడ్డికి ముస్లిం మైనార్టీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

రబీ సాగుకు ఈ-కేవైసీ తప్పనిసరి



బొగ్గిడివారిపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ - కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్బీకేలో పలు రికార్డులను పరిశీలించారు. అంతేగాకుండా బొగ్గిడివారిపల్లికి చెందిన రైతు శివరామిరెడ్డి సాగుచేసిన మిరప పంటను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో 30 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. బస్తా ధర రూ. 266.50పైసలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తీసుకోవచ్చునన్నారు. పంటల్లో జిగురు పూసిన పసుపు తెలుపు పల్లాలు రసం పీల్చు పురుగుల నివారణకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుతం మిరపలో ముడత రోగం (తామర పురుగు)వచ్చిందని దీని నివారణకు సయాట్రా నిలిప్రోల్ (కొరేజిన్)ఒక లీటరు నీటికి 0.6 మిల్లీ లీటర్‌ల నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం రబీలో వరి, వేరుశనగ, నువ్వులు, దోస పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు క్షేత్ర స్థాయి పర్యటనలో తెలిసిందని ఆయన అన్నారు.

డ్రోన్ వినియోగంతో రైతులకు ఆదాయం



సిద్ధవరంలో డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని సిద్దవరం పంచాయతీలో డ్రోన్‌పై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలతా రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పొలాలకు స్ప్రే చేసుకుంటే ఖర్చులు తగ్గుతాయని, ముఖ్యంగా వరి ఇతర పంటలకు ఈ డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలియజేశారు. మినుము, నువ్వుల పంటలకు ఈ డ్రోన్‌తో స్ప్రే చేసుకుంటే ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. డ్రోన్ ద్వారా కలిగే లాభాలను వారు వివరించారు. కార్యక్రమంలో కాకతీయ వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు లేబాకు శ్రీనివాసులు రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇళ్ల వద్దకే గ్యాస్ సిలిండర్లు

కడప, అన్నమయ్య జిల్లాల సేల్స్ అధికారి ప్రవీణ్

రామాపురం : అవసరమైన వినియోగదారులు గ్యాస్ సిలిండర్‌ను ముందుగానే బుకింగ్ చేసుకుంటే వినియోగదారుల ఇళ్ల వద్దకే గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ బాయ్‌లు సరఫరా చేస్తారని కడప, అన్నమయ్య జిల్లాల సేల్స్ అధికారి ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హసనాపురం పంచాయతీలోని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో గ్యాస్ కనెక్షన్లు లేని నిరుపేదలుంటే ఉజ్వల గ్యాస్ పథకాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి 5కేజీలు గ్యాస్ సిలిండర్‌ను కూడా అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు గ్యాస్ అవసరమైన వారు బుక్ చేసుకుంటే గ్యాస్ సిలిండర్‌ను ఇళ్ల వద్దకే అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ అసోసియేషన్ రాయలసీమ సంయుక్త కార్యదర్శి సి.వి.సుబ్బారెడ్డి, ఇండియన్ గ్యాస్ మేనజర్ రమణారెడ్డి, ఈశ్వరమ్మ, డెలివరీ బాయ్స్ వంశీ, ధనుజంయరెడ్డి, శివ, కుద్దుస్ పాల్గొన్నారు.

సకాలంలో అన్ని రకాల రుణాలు



సంబరాలు జరుపుకుంటున్న బ్యాంకు సిబ్బంది

గాలివీడు : కడప జిల్లా సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రూ.3వేల కోట్లు ఆర్థిక లావాదేవీలు అయిన సందర్భంగా మంగళవారం స్థానిక మండల సహకార శాఖలో ఏజీఎం పి.వి.నారాయణ రాజు, మేనేజర్ సి.వి.నారాయణరెడ్డి, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాట్లాడుతూ గాలివీడు శాఖను 2012 సంవత్సరం డిసెంబర్ 3న ప్రారంభించినట్టు చెప్పారు. గాలివీడు శాఖతోపాటు రెండు సంఘాల అవుట్ స్టాండింగ్ రూ.75 కోట్లు జరిగిందని, అన్ని రకాల రుణాలు సకాలంలో అందించడం జరుగుతోందని తెలిపారు. జిల్లా సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రూ.3వేల కోట్లు ఆర్థిక లావాదేవీలు జరగడంపై హర్షం వ్యక్తం చేశారు.

తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా జయంతి



ఫాతిమా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు రూరల్ : ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలు మాల మహానాడు, అంబేడ్కర్‌సేన బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఫాతిమా చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, బలరాం మాట్లాడుతూ దేశంలో అతి శూద్రులు, శూద్రులుగా విభజించబడి విద్యకు దూరం చేయబడిన సామాజిక వర్గాలను, అందులోనూ బాలికలను విద్యావంతుల్ని చేయడానికి మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే ఉద్యమించారన్నారు. పూలే స్థాపించిన పాఠశాలలో ఫాతిమా షేక్ ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతలు చేప ట్టి పలువురిని విద్యావంతుల్ని చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గట్టప్ప, మల్లికార్జున, ఆనంద్, సుభాష్, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వం సానుకూలం

పీలేరు : అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కార్యకర్తలందరూ విధుల్లోకి రావాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు చిన్నమ్మ కోరారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ మన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లవచ్చునని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి ఉచ్చులో పడరాదని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వర్కర్లకు రాత పరీక్ష ద్వారా 560 మంది ప్రమోషన్లు కల్పించిందని గుర్తు చేశారు. గర్భవతులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క అంగన్‌వాడీ కార్యకర్త తక్షణం విధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, ఆరీఫా, రోజారాణిలు పాల్గొన్నారు.